

నిర్మలమ్మా.. నిధులివ్వమ్మా!



నేటి పద్దులోనైనా పైసలిస్తారా..

- నేడే కేంద్ర వార్షిక బడ్జెట్
- మూడోసారి నిర్మలమ్మ పద్దు
- జిల్లాకు ఈసారైనా న్యాయం జరిగేనా
- వెక్కిరిస్తున్న విభజన హామీలు
- రూ.300 కోట్ల పెట్టుబడుల మాటేంటి
- ఐఐపీ, ఐఐఎఫ్‌టీకి అప్పట్లో ప్రకటన
- ఇప్పటికీ పట్టాలెక్కని ఇన్‌స్టిట్యూట్స్
- సెజ్‌లో ఖాళీగా మారిన భూమి
- తాత్కాలిక భవనంలోనే ఐఐఎఫ్‌టీ
- పదేళ్లలో కేటాయింపు రూ.20 కోట్లే
- కలగా పెట్రో కెమికల్ కాంప్లెక్స్
- పదేళ్లుగా పట్టించుకోని వైనం
- కేంద్రంలో కీలకంగా కూటమి
- సహకరిస్తే మారనున్న దశ దిశ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)


ఒకటి కాదు రెండు కాదు.. పదేళ్ల నుంచీ నిరీక్షణ.. విభజన హామీలు అమలుకు నోచుకుంటాయని.. జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని.. కానీ ఎప్పటి కప్పుడు అదే రిక్తహస్తం.. వినిపించుకోని వినతులు.. పట్టాలెక్కని ప్రాజెక్టులు.. కంటి తుడుపుగానైనా కాణీ కూడా ఇవ్వని బడ్జెట్ పద్దులతో ప్రతిసారీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నష్టపోతూనే ఉంది.. అయినా పదేళ్ల నుంచీ ఎదురుచూపులు చూస్తూనే ఉంది. అయితే మూడోసారి వరుసగా గద్దెనెక్కిన మోదీ ప్రభుత్వానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వెన్నెముకగా మారిన నేపథ్యంలో ఈ పద్దులోనైనా జిల్లాకు మేలు జరుగుతుందా అనే ఆశలు అందరిలో నెలకొన్నాయి. విభజన సమయంలో ఇచ్చిన హామీలకు ఈసారైనా న్యాయం జరుగుతుందా అని అంతా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా 2014లో అప్పట్లో విభజన హామీల కింద కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లు రూ.300 కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. రూ.32వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. అయితే ఇప్పటికీ అవి వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఒక్క ఫారన్‌ట్రేడ్ క్యాంపస్ మాత్రం ఏదో మొక్కుబడిగా జేఎన్టీయూకేలో తాత్కాలిక భవనంలో నడుస్తోంది. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో అయినా నిధులిల్చి మోక్షం కల్పించాల్సిన అవసరం ఉంది.

భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ వచ్చేనా?

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్ర ప్రభుత్వం కాకినాడలో రూ.32 వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. అందులో భాగంగా 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో రెండు వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటుచేయడానికి గెయిల్-హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాల నుంచి ముడిచమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటుచేసి దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలు ఎక్కించడానికి గత టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపింది. చమురు కంపెనీల ఇంజనీర్లు వచ్చి సెజ్ భూమి నాణ్యత పరీక్షించి పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అనువుగా ఉందని తేల్చారు. తర్వాత పనులు ప్రారంభించేలా కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఒత్తిడి తెచ్చారు. పైగా అప్పట్లో రాష్ట్రంలో కేంద్రానికి భాగస్వామ్యం ఉండడంతో అనుమతి పనులు చకచకా ముందుకు కదిలాయి. ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధి పొందనున్నందున రూ.5,615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రానికి విన్నవించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కొంత మెత్తబడినట్టే కనిపించింది. కానీ ఈలోపు రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో విషయం మళ్లీ మొదటికొచ్చింది. తర్వాత పెట్రో కాంప్లెక్స్ విషయమై జగన్ సర్కారు కేంద్రాన్ని నిలదీయలేక ఐదేళ్లు పట్టించుకోలేదు. తాజాగా రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి ఫైళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు దుమ్ము దులిపించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టు కదిలేలా పావులు కదపడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కేంద్రం బడ్జెట్ పద్దులో దీనికి సంబంధించి కీలక ప్రకటన చేస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దశ, దిశ మారనుంది. పైగా ప్రస్తుతం కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నేపథ్యంలో నిర్మలమ్మ పద్దులో దీన్ని పట్టించుకుని పట్టాలెక్కిస్తారా? లేదా? అన్నది చూడాలి. అటు వేతన జీవులు సైతం ఈ బడ్జెట్‌లో మేలు చేసే నిర్ణయాలు ఉంటాయేమోనని ఎదురుచూస్తున్నారు. ఆదాయపు పన్ను పరిమితిని పెంచితే పెరిగిన ధరాభారాన్ని ఎంతో కొంత తట్టుకునేందుకు వీలుంటుందని చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లో హెచ్ఆర్ఏ మినహాయింపు సైతం పెంచుతారనే చర్చ జరుగుతోంది.

మాటలే..మూటల్లేవు..

ఏటా కేంద్రం ప్రవేశపెడుతున్న వార్షిక బడ్జెట్‌లో జిల్లాలో కీలక ప్రాజెక్టులకు నిధులు విడుదలవుతాయనకుంటే ప్రతిసారీ రిక్తహస్తమే. విభజన సమయంలో జిల్లాకు ప్రకటించిన ఏ ప్రాజెక్టును కేంద్రం పట్టించుకోవడం లేదు. అసలు వాటి ఉనికినే పక్కనపడేసింది. ప్రధానంగా రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్కో జిల్లాకు ఒక్కో కీలక ప్రాజెక్టు ప్రకటించింది. అందులో భాగంగా కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఒక్కో దానికి రూ.150 కోట్లు ఇస్తామని మాట ఇచ్చింది. తద్వారా ఈ రెండు క్యాంపస్‌ల రాకతో అటు యువతకు ఉద్యోగావకాశాలు, పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అంతా భావించారు. దీనికి తగ్గట్టే 2014 తర్వాత ఈ రెండింటికీ అప్పటి బడ్జెట్‌లో కేంద్రం చెరో రూ.10 కోట్లు కేటాయించింది. ఈ రెండు క్యాంపస్‌లు చాలా వేగంగా అందుబాటులోకి వస్తాయని అంతా భావించారు. ఎలాగూ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగడంతో అప్పట్లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో ఈ రెండు విద్యాసంస్థల ఏర్పాటుకు 50 ఎకరాలు సిద్ధం చేశారు. ఆ తర్వాత కేంద్రం వీటి ఊసే మర్చిపోయింది. పదేళ్లగా కేంద్రం బడ్జెట్‌లో చిల్లిగవ్వ కూడా విదల్చడం మానేసింది. గతేడాది అతికష్టంపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ క్యాంపస్‌ను తాత్కాలికంగా కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాటుచేశారు. ఈ బడ్జెట్‌లో వీటికి నిధులు కేటాయిస్తే సమస్యలు తీరే అవకాశం ఉంది. కొత్త క్యాంపస్‌లకు శాశ్వత భవనాలు సమకూరేలా కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉంది. గతేడాది కాకినాడకు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జేఎన్టీయూలో తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభించడం విశేషం. ఈ నేపథ్యంలో వీటికి నిధులు కేటాయించాలని అంతా కోరుతున్నారు.



బోడసకుర్రు-పాశర్లపూడి గోదావరిపై రైల్వే వంతెన నిర్మాణ పనులు (ఫైల్)



'కోటిపల్లి'పై ఆశలెన్నో!

- కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు నిధులొచ్చేనా
- నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్న ఎంపీ హరీష్
- ప్రస్తుత బడ్జెట్‌లో అధిక నిధుల సాధనే లక్ష్యం
- కోనసీమలో రైలు కూత కోసం ఎదురుచూపులు

అమలాపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ నిర్మాణానికి నిధుల కేటాయింపులో ప్రధాని మోదీ ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతపై జిల్లావాసులు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి బడ్జెట్ కేటాయింపుల్లో ఈ రైల్వే లైన్‌కు నిధుల కేటాయింపు మొక్కుబడిగా మాత్రమే జరుగుతుండడంతో రైల్వేలైన్ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. మూడు ప్రధాన గోదావరి నదులపై వంతెనల నిర్మాణానికి పిల్లర్లు పూర్తయ్యాయి. అయితే కోటిపల్లి నుంచి అమలాపురం వరకు మాత్రమే రైల్వే లైన్ కోసం భూసేకరణ మాత్రమే పూర్తికాగా, మిగిలిన భూసేకరణ పూర్తికాకపోవడంతో రైల్వేమార్గం ముందడుగు వేయడం లేదనే అభిప్రాయం నెలకొంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టే రైల్వేబడ్జెట్‌లో 57.21 కిలోమీటర్ల నిడివి కలిగిన కోటిపల్లి- నరసాపురం రైల్వేలైన్ నిర్మాణానికి నిధుల కేటాయింపుపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. గత ఏడాది బడ్జెట్‌లో రూ.100 కోట్లను కేటాయించారు. అయితే రైల్వేలైన్, వంతెనల నిర్మాణ ప్రగతి ముందడుగు పడడంలేదు. గతంలో వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు వ్యయంలో 25 శాతం నిధులు కేటాయించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టు మరుగున పెట్టేసింది. కాగా కోనసీమ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సైతం ఈ రైల్వే ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుకోసం తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రకటించారు. ముఖ్యంగా దివంగత లోక్‌సభ మాజీ స్పీకర్ సీఎంసీ బాలయోగి తనయుడు గంటి హరీష్ మాధుర్ అమలాపురం లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ ఎంపీగా ఎన్నికయ్యారు. తన తండ్రి జీవిత లక్ష్యాల్లో అత్యంత కీలకమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణం పూర్తిచేసి కోనసీమ వాసులకు రైలు కూత వినిపించడమే తన లక్ష్యమని హరీష్ చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను తన ఐదేళ్ల పదవీకాలంలో ఈ రైల్వేలైన్ నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అంకితమిస్తామని హామీ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీ పాయలపై నిర్మించే వారధులపై గడ్డర్ల ఏర్పాటు, ట్రాక్ నిర్మాణాలకు అవసరమైన నిధులు ఏ మేరకు కేటాయిస్తారనే చర్చ కోనసీమ వాసుల్లో ప్రారంభమైంది.

పార్లమెంటులో ఒలింపిక్స్ క్రీడాకారులకు అభినందనలు తెలిపిన ఎంపీ హరీష్



అమలాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎంపీగా గెలుపొందిన గంటి హరీష్‌బాలయోగి పార్లమెంటులో సోమవారం తొలిసారిగా ప్రసంగించారు. 2024లో పారిస్‌లో జరగబోయే ఒలింపిక్స్‌కు వెళ్తున్న భారత క్రీడాకారులను అభినందిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. హరీష్ మాట్లాడుతూ తన అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఒలింపిక్స్‌లో పాల్గొనబోతున్న రంకిరెడ్డి సాయిసాత్విక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సాత్విక్ వంటి క్రీడాకారులు ఏపీ రాష్ట్ర ప్రతిభను ప్రపంచానికి చాటుతున్నారని ప్రశంసించారు. ఏపీలోని అమరావతితో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేయడానికి కేంద్ర ప్రభుత్వ సాయం అవసరమని కోరరారు. ఈ యూనివర్సిటీ ద్వారా ఎంతోమంది క్రీడాకారులకు ఆధునాతన శిక్షణ సదుపాయాలు అందుబాటులోకి వచ్చి క్రీడల్లో మరింత రాణిస్తారన్నారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక క్రీడాకారులు తమ ప్రతిభకు పదును పెట్టి అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్టతను నిలబెట్టగలిగేలా ప్రోత్సహించవచ్చని ఎంపీ హరీష్ అన్నారు. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే మన క్రీడాకారులు మరింత ప్రతిభావంతులుగా పోటీ పడగలుగుతారన్నారు. తన ప్రసంగం చివరిలో పారిస్ ఒలింపిక్స్‌కి వెళ్తున్న భారత్ క్రీడాకారులకు మద్దతుతోపాటు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

పుల్లేటికుర్రు సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

అంబాజీపేట, జూలై22: నిబంధనలకు విరుద్ధంగా 15వ ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసిన పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు (పీఎఫ్ఎంఎస్) అకౌంటు ద్వారా కాకుండా నేరుగా సర్పంచ్ చెక్‌తో రూ.6.54 లక్షలు డ్రా చేశారు. ఈ విషయంపై సంజాయిషీ ఇవ్వాలని అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అయితే సర్పంచ్ సరైన సమాధానం తెలియజేయకపోవడంతో ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి సర్పంచ్ చెక్‌పవర్‌ను మూడు నెలలపాటు రద్దుచేశారు. ఈ విషయంపై సర్పంచ్ జల్లి బాలరాజును వివరణ కోరగా వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు మంజూరు చేశారన్నారు. ఆ నిధులు వెనక్కి తీసుకుంటారని డ్రా చేశామని, ఆ నిధులను సీసీ రోడ్లు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు వినియోగించామని తెలిపారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగిన రైతులు

ధాన్యం బకాయిల కోసం రోడ్డెక్కిన రైతులు

అమలాపురం టౌన్, జూలై 22: రైతు భరోసా కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించి 70 రోజులు దాటినా రబీ ధాన్యం బకాయిలు విడుదల కాకపోవడంతో రైతులు సోమవారం రోడ్డెక్కారు. కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. కలెక్టరేట్‌లోకి దూసుకువచ్చారు. అయినవిల్లి, ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం మండలాలకు చెందిన రైతులు ధాన్యం బకాయిలు చెల్లించాలని డిమాండు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఎన్నికల సమయంలో కోడ్ అమలులోకి రావడంతో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి ఇంతవరకు సొమ్ములు బ్యాంకు ఖాతాలకు జమ కాలేదని, ఇప్పటికే పలు పర్యాయాలు గత కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడులు లేక పంట వేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. రెండు, మూడు రోజుల్లోగా సొమ్ములు విడుదల కాకపోతే క్రాప్ హాలీడే ప్రకటిస్తామన్నారు. జేసీ ఎస్.నుపూర్‌అజయ్‌ను కలిసి రైతులు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో వాకపల్లి శ్రీను, వాసంశెట్టి తేజామాధవ్, గుండుమోగుల చిట్టిబాబు, వాసంశెట్టి వెంకటరమణ, కొలిశెట్టి రామచంద్రరావు, గోకరకొండ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.





ఆలమూరు మండలం జొన్నాడ బ్రిడ్జి వద్ద సోమవారం ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి వరద.. అయినవిల్లిలంక కాజ్‌వేపై వరద నీటిలో రాకపోకలు సాగిస్తున్న జనం

లంక గ్రామాల్లో.. ముంపు భయం





మండపేట పట్టణంలోని ఆలమూరు రోడ్డులో ఇంకా ముంపులోనే ఉన్న వరిచేలు.... బూరుగులంక రేవులో పడవపై ప్రయాణం చేస్తున్న జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

- క్రమేపీ జల దిగ్బంధానికి గురవుతున్న లంక గ్రామాలు
- వరద ప్రభావిత గ్రామాల్లో జిల్లా కలెక్టర్ పర్యటన
- ధవళేశ్వరం వద్ద 12 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- పొంగి ప్రవహిస్తున్న కోనసీమ నదులు

పి.గన్నవరం/ముమ్మిడివరం, జూలై22: గోదావరికి వరద పోటెత్తడంతో ఆ ప్రభావం కోనసీమ లంక గ్రామాలపై పడింది. ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి పెరగడంతో ధవళేశ్వరం నుంచి దిగువకు 12 లక్షలకు పైగా మిగులు జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో దిగువన కోనసీమలోని నదీపాయల్లో వరదనీరు పోటెత్తుతోంది. ఇప్పటికే లంకల్లోకి వచ్చి చేరిన వరద నీరు గ్రామాల్లోకి ప్రవహిస్తోంది. వరద తాకిడి దృష్ట్యా లంకగ్రామాల్లో రైతులు వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలను బయటకు తరలించుకుంటున్నారు. ఇప్పటికే పి.గన్నవరం మండలం గంటి పెదపూడి, ఊడిమూడి గ్రామాల శివారు నాలుగు లంకగ్రామాల ప్రజలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇంజన్ బోట్లపై రాకపోకలు సాగిస్తుండగా, చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే నీటమునగడంతో స్థానికులు పడవలపై ప్రయాణం సాగిస్తున్నారు. అటు మానేపల్లి శివారు శివాయిలంక గ్రామంలోని రోడ్లపైకి వరదనీరు వచ్చి చేరుతోంది. ఇదే ఒరవడి కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో మండలంలోని నాగు ల్లంక, లంకల గన్నవరం, వాడ్రేవుపల్లి తదితర గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లోకి పూర్తిస్థాయిలో వరదనీరు వచ్చే అవకాశం ఉంది. కాగా శివాయిలంకలోని వరద పరిస్థితిని ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పరిశీలించి పలు సూచనలు చేశారు.

పెరుగుతున్న గోదావరి ఉధృతి

వరద ఉధృతి పెరగడంతో ముమ్మిడివరం మండలంలో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల్లోని లోతట్టు లంక భూముల్లోకి వరద నీరు ప్రవేశిస్తోంది. ఇప్పటికే గురజాపులంకలో లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. బెండ, బీర, వంగ, అనబ తదితర పంటలు నీట మునుగుతున్నాయి. దీంతో రైతులు వాటిని ఒబ్బిడి చేసుకునే ప్రయత్నాలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లోని రైతులు పశువులు, పశుగ్రాసాన్ని మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు. వాణిజ్య పంటలైన కొబ్బరికాయలు తదితర వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేపట్టారు. వరద ప్రాంతాల్లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ బి.శ్రీనునాయక్, మండల పరిపాలనాధికారి ఎ.నాగశ్రీనివాస్‌లతో కూడిన బృందం సోమవారం లంక గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించి ప్రజల్ని అప్రమత్తం చేశారు. వీఆర్వోలు స్థానికంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు తాగునీరు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

భయపడాల్సిన పనిలేదు : కలెక్టర్

వరద ప్రభావిత లంకగ్రామాల్లో ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 45 లంకగ్రామాలుండగా, ప్రస్తుతం ఆరు లంక గ్రామాల్లో జనం రాకపోకల నిమిత్తం లైఫ్ జాకెట్లతో కూడిన బోట్లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. సోమవారం ఆయన పి.గన్నవరం మండలం గంటిపెదపూడి శివారు బూరుగులంకలో కలెక్టర్ పర్యటించారు. అలాగే ముమ్మిడివరం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంక గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరదల నేపథ్యంలో ముమ్మిడివరం, పి.గన్నవరం, అయినవిల్లి, అల్లవరం మండలాలకు ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందన్నారు. వారంతా లంకగ్రామాల్లో ప్రస్తుతం ఉన్న సమస్యలను గుర్తిస్తున్నారని, విద్యుత్, తాగునీరు, పశుగ్రాసం ఎంతమేర అవసరం ఉంది, పునరావాస కేంద్రాలు, భోజనాల ఏర్పాటు, వైద్యశిబిరాలు తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. మిగిలిన లంక గ్రామాల్లో కూడా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామన్నారు. అలాగే లంకగ్రామాల్లో ఉన్న గర్భిణీలను, వృద్ధులను గుర్తించి బయటకు తరలించే ఏర్పాటుచేశామన్నారు. అధికారిక రేవులను మూసివేసి ప్రభుత్వం పోలీసు, రెవెన్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోట్లను వినియోగించుకోవాలన్నారు.

75 కాజ్‌వేలు, వంతెనలు బలహీనం

జిల్లావ్యాప్తంగా బలహీనంగా ఉన్న 75 కాజ్‌వేలు, వంతెనలు, కల్వర్టులు గుర్తించామని, వాటి వద్ద ప్రమాద హెచ్చరికలతో కూడిన బారికేడ్లు ఏర్పాటుచేసి, స్థానికులకు ప్రత్యామ్నాయ రహదారులు ఏర్పాటుచేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. జిల్లా కేంద్రంలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని, వరద ఉధృతి దృష్ట్యా ఆయా మండలాలకు పంపిస్తామన్నారు. జిల్లాలో ప్రస్తుతం వర్షాలు, వరదలు ఒకేసారి రావడంతో పలు చోట్ల వరిపంటలు నీటమునిగాయని, 54 అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు ఉండగా రెండు డ్రైన్లు వద్ద ఇబ్బందులు తలెత్తాయన్నారు. కూనవరం, వాసలతిప్ప డ్రైన్లు సముద్రంలో కలిసేచోట పూడికతీత ఎక్కువగా ఉందని, ప్రస్తుతం వాటిని తొలగింపజేస్తున్నారని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం వరద ఉధృతి దృష్ట్యా ఇబ్బందులు లేవని, మూడో ప్రమాద హెచ్చరిక జారీచేస్తే ముమ్మిడివరం మండలంలో పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుందని, ఠాణేలంక వివేకనంద వారధి వద్ద పునరావాసకేంద్రం ఏర్పాటుచేసి వరద బాధితులకు వసతి కల్పించవల్సివుందన్నారు. ఆయా మండలాల పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహశీల్దార్లు ఎస్‌కె హుస్సేన్, బి.శ్రీనునాయక్, ఎంపీడీవో సీహెచ్ త్రి శూలపాణి, ఏఎస్ శ్రీనివాస్, ఆర్ఐ పంతం శ్రీనివాస్, ఈవోపీఆర్డీ సీహెచ్‌ఎల్ కల్యాణి, వీఆర్వో ఆర్ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నూకపెయ్యి ప్రసన్నకుమార్, దంగేటి అన్నవరం, ఎంపీటీసీ పల్లి మోసే తదితరులు ఉన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

ముమ్మిడివరం, జూలై 22: వరదలు, వర్షాల కారణంగా జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. కాగా జిల్లాలోని ఉపవిద్యాశాఖ అధికారులకు, మండల విద్యాశాఖ అధికారులకు ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీచేశారు.

ఆక్వా రైతుల ఆందోళన

మలికిపురం, జూలై 22: గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పులతో చెరువుల్లో రొయ్యలు మేతలు తినడం లేదని, ఉష్ణోగ్రతలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు వారంపాటు ఇదే వాతావరణం కొనసాగడంతో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన సమస్య తలెత్తింది. అలాగే పలు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ముంపు నీరు గట్లను తాకి ఏ సమయాన గండ్లు పడతాయోననే ఆందోళనలో ఉన్నారు. కొబ్బరి రైతులు మాత్రం ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. చెట్లకు పట్టిన నల్ల పురుగు, తెల్లపురుగు పోయి చెట్లు పచ్చబడతాయని అంటున్నారు.



ముమ్మిడివరం మండలం గురజాపులంకలో మునిగిన బెండ

'ఏలేరు' నిండుతోంది..



ఏలేశ్వరం, జూలై 22: ఏలేరు రిజర్వాయర్‌లోకి సోమవారం ఎగువ కాలువ నుంచి 17610 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. గతంలో ఎన్నడూలేని రీతిలో భారీ స్థాయిలో నీరు చేరడంతో నీటిమట్టం పెరిగింది. పురుషోత్తపట్నం పథకం నుంచి మరో 875 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 75.61 మీటర్ల స్థాయిలో 8.86 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. గత 24 గంటల వ్యవధిలో 2.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఎడమ కాలువ నుంచి విశాఖ పట్నానికి 200 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 60 క్యూసెక్కుల వంతున నీరు చేరుతోంది.

'తాండవ' పొంగుతోంది..



కోటనందూరు,జూలై22: ఎగువ ప్రాంతంలో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తాండవ రిజర్వాయర్ నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతమైన గొలుగుండ మండలంలోని బొడ్డేరు, ధారగెడ్డ, బోరింగు గెడ్డ లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. వారం రోజులకు ముందు కేవలం కనిష్ఠ నీటిమట్టానికే ఉన్న రిజర్వాయర్ వారం రోజుల వ్యవధిలో సుమారు 13 అడుగులు మేర పెరిగి సోమవారం నాటికి 369 అడుగులుగా నమోదైనట్లు డీఈ అనురాధ తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 2300 క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని చెప్పారు.

నిండు కుండలా 'భూపతిపాలెం'



రంపచోడవరం, జూలై 22: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భూపతిపాలెం జలాశయం నిండు కుండలా మారింది. కొండ కాలువల నుంచి జలాశయానికి నీరు చేరడంతో అధికారులు మూడు గేట్లు ఎత్తి నీటిని ముసురుమిల్లి జలాశయానికి వదిలారు.



కూనవరం వద్ద బ్రిడ్జి ఆనుకుని ప్రవహిస్తున్న శబరినది

గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది..అంతకంతకూ ఉధృతి పెరుగుతోంది..భద్రాచలం వద్ద ప్రమాదకర స్థితిలో గోదావరి ప్రవాహం ఉంది. ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. విలీన మండలాలైన చింతూరు, ఎటపాక, వరరామచంద్రపురం, కూనవరంలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. మరోవైపు ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం పెరగడంతో దిగువకు లక్షలాది క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల వైపు నీరు చేరుతోంది...

వరద గోదారి

వణుకుతున్న పరివాహక ప్రాంతాలు



పునరావాస కేంద్రంలోనే వంట



కలెక్టర్ దినేష్ పర్యటన

చింతూరు, జూలై 22: శబరి దోబూచులాడుతోంది. తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతోంది. ఇక భద్రాచలంలో గోదావరి పెరుగుతూనే ఉంది. దీంతో ముంపు ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో వందకు పైగా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వారంతా నిత్యావసర సరుకుల కోసం అవస్థలు పడుతున్నారు. చింతూరు వద్ద శబరి నీటిమట్టం ఆదివారం రాత్రికి 39.5 అడుగులకు చేరింది. కాగా సోమవారం ఉదయానికి ఒక్క అడుగు తగ్గి 38.5 అడుగులకు చేరుకుంది. దీంతో ముంపు ప్రాంత వాసులు ఒకింత ఊపిరి పీల్చుకున్నారు. కానీ సోమవారం సాయంత్రం నుంచి తిరిగి శబరి నది పెరగడం మొదలైంది. దీంతో సోమవారం సాయంత్రానికి చింతూరు వద్ద శబరి నీటిమట్టం తిరిగి 39 అడుగులకు చేరుకుంది. ఇక భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 49 అడుగులకు చేరుకుంది. దీంతో అక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద స్థాయి మరింత పెరిగే అవకాశం ఉందంటూ అధికారులు చెబుతున్నారు. మన రాష్ట్రంతో పాటు ఒడిసాలో కూడా విస్తారంగా వర్షం కురుస్తున్న క్రమంలో సీలేరు జల విద్యుత్ కేంద్ర రిజర్వాయర్లు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి. దీంతో డ్యాం గేట్ల నుంచి దిగువకు నీరు విడుదల చేసే పరిస్థితి ఏర్పడనుందని డొంకరాయి కార్యనిర్వాహక ఇంజనీరు ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ ఒక్కరూ సీలేరు నది మీదుగా దాటే ప్రయత్నం చేయవద్దని, పశువులను కూడా ఆ వైపు వెళ్లకుండా చూసుకోవాలని డొంకరాయి జలాశయ కేంద్రం దిగువ గ్రామస్థులకు సూచనలిచ్చారు. దీంతో ముంపు ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరరామచంద్రపురం, చింతూరు మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. మరో వైపు చింతూరు మీదుగా ఛత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ రాష్ట్రాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. గత మూడు రోజులుగా చింతూరు మండలం చట్టి వద్ద లారీలు ఇతరత్రా వాహనాలను నిలుపుదల చేశారు. దీంతో వారంతా వాహనాల్లోనే వంటలు చేసుకుంటున్నారు. పలు కుటుంబాలు స్వచ్ఛందంగా కర్రలతో పూరిపాకలు వేసుకుని పునరావాసాలుగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. వారంతా తమకు టార్పాలిన్లు, కొవ్వొత్తులు, దోమతెరలతో పాటు ఇతర నిత్యావసర సరుకులను సమకూర్చాలని కోరుతున్నారు. దోమల బెడద మరింత ఎక్కువగా ఉందంటూ వారంతా వాపోతున్నారు. పలు ముంపు గ్రామాలకు నాటు పడవలు సమకూర్చాలని కోరుతున్నారు. 30వ నెంబరు జాతీయ రహదారిపై వరద నీరు చేరడంతో పలు వాహనాలు చిక్కుకున్నాయి. దీంతో ఆయా వాహనాలను పోలీసు శాఖ ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేస్తోంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిసా రహదారుల వెంబడి ప్రయాణాలను పోలీసులు పూర్తిగా నిషేధించారు. సోమవారం అల్లూరి సీతారామరాజు కలెక్టర్ దినేష్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే బృందం విలీన మండలాల్లో పర్యటించి బాధితుల అవసరాలను తెలుసుకున్నారు.

వాగుల ఉధృతి



వెలగపల్లి-దొనలంక మధ్య పొంగిన వాగు

దేవీపట్నం, జూలై 22: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శబరి, కిన్నెరసాని నదులు పొంగి ప్రవహించడంతో గోదావరి నదికి వరదనీరు చేరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద రెండో ప్రమాదక హెచ్చరిక జారీ చేయడంతో ప్రవాహం మరింత ఎక్కువైంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగింది. ఆదివారం సాయంత్రం గోపురం వరకు చేరిన వరద నీరు సోమవారం మరింత పెరగడంతో పూర్తిగా మునిగిపోయింది. ఎడతెరిపి లేని వర్షం కురవడంతో సీతపల్లి, వెలగపల్లి, దోనలంక తదితర వాగులు పొంగి ప్రవహించాయి.

వరద భయం



ఎటపాక మండలంలో పునరావాస కేంద్రాలకు తరలిపోతూ..

ఎటపాక, జూలై 22: భద్రాచలం-కూనవరం రహదారిని వరద ముంచెత్తింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూరుమూరు- పోలిపాక గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహించింది. దాంతో అర్ధరాత్రి నుంచి భద్రాచలం- కూనవరానికి వాహన రాకపోకలు స్తంభించాయి. అలాగే నందిగామ, మురుమూరు, గౌరిదేవిపేట, నెల్లిపాక, వీరాయిగూడెం, నల్లకుంట గ్రామాల వద్ద ప్రధాన రహదారులపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి. వీరాయిగూడెం- నెల్లిపాక గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు స్తంభించడంతో వీరాయిగూడెం గ్రామ గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొల్లగూడెం, గన్నవరం గ్రామాల్లోని ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించారు. నెల్లిపాక, రాయనపేట వద్ద గోదావరి వరదను టీడీపీ రాష్ట్ర నాయకులు జమాల్‌ఖాన్ మండల అధ్యక్షుడు పుట్టి రమేష్‌తో కలిసి పరిశీలించారు.



పి.గన్నవరం మండలం గంటిపెదపూడిలో నీటమునిగిన మిర్చి

ప్రతి గంటకు సమాచారమందిస్తాం

- అప్రమత్తంగా ఉండండి
- అధికార యంత్రాంగం అండగా ఉంటుంది
- పునరావాస కేంద్రాల్లో సదుపాయాలు కల్పిస్తాం
- నిత్యావసర సరుకులు అందిస్తాం
- అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు, జూలై 22: వరద తీవ్రతపై బాధిత గ్రామాలకు గంట గంటకూ సమాచారం అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. విలీన మండలాల్లోని ముంపు ప్రభావిత గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. అనంతరం చింతూరులో పత్రికా ప్రకటన విడుదల చేశారు. గోదావరి, శబరి నదులు వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. విలీన మండలాల్లో 177 గ్రామాలు ప్రభావితమయ్యే పరిస్థితి ఉందన్నారు. చింతూరు, డొంకరాయితో పాటు భద్రాచలానికి చెందిన సెంట్రల్ వాటర్ కమిషన్ ద్వారా వరద హెచ్చరికలను జారీ చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే భద్రాచలంలో గోదావరి నది 49 అడుగుల మేర ప్రవహిస్తుండడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారన్నారు. విలీన మండలాల్లో 149 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐటీడీఏ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా బాధితులకు బియ్యం, కందిపప్పు, పామాయిల్, కూరగాయలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 44 బోట్లను అందుబాటులో ఉంచామని, 4600 లీటర్ల కిరోసిన్ సరఫరా చేసినట్లు చెప్పారు. ప్రతి పడవకు 12 లైఫ్ జాకెట్లు అందించామన్నారు. వైద్యశాఖను అప్రమత్తం చేశామన్నారు. శానిటేషన్ పనులు కూడా ప్రారంభించామని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.



పి.గన్నవరం:గంటిపెదపూడిలో లంక గ్రామస్తుల ఇబ్బందులు



పి.గన్నవరం: గంటిపెదపూడిలో ఇంజన్ బోటుపై రాకపోకలు

సుద్దగడ్డకు పోటెత్తిన వరద నీరు



గొల్లప్రోలు పట్టణ శివారులో రోడ్డుపై సుద్దగడ్డ నీరు

గొల్లప్రోలు, జూలై 22: ఎగువ ప్రాంతాలతో పాటు స్థానికంగా కురుస్తున్న వర్షాలతో సుద్దగడ్డకు వరద నీరు పోటెత్తింది. సోమవారం గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ(కొండ)కాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై నాలుగు అడుగుల ఎత్తున ప్రవహిస్తున్నది. దీంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లే సమయంలో వరద నీరు స్వల్పంగా ఉండిపోవడంతో ఇదే మార్గంలో వెళ్లిన విద్యార్థులు తిరిగి కాలనీకి చేరేందుకు అవస్థలు పడ్డారు. పంటపొలాలు మీదుగా రాకపోకలు సాగించారు. మరోవైపు వరదనీట మునిగిన రహదారిపై భారీ గోతులు పడటంతో నీటిని దాటేందుకు కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపైకి సుద్దగడ్డ వరద నీరు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి రాత్రి వరకూ సుద్దగడ్డ వరద ఉధృతి పెరుగుతుండటంతో పట్టణంలోని ఈబీసీ, ఎస్సీ, అరుంధతీయ కాలనీ వాసులు, దేవీనగర్, కంకరరేవడ్డు తదితర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గొల్లప్రోలు జగనన్న కాలనీ రహదారిపై వరద పరిస్థితిని తహసీల్దారు ఉదయబాస్కర్, ఎస్ఐ జానీబాషా పరిశీలించారు. జనసేన నాయకులు పర్యటించారు.

భయం గుప్పెట్లో..

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- దిగువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు
- లంక గ్రామాల వైపు వరద నీరు..



ధవళేశ్వరం, జూలై 22: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో అంతకంతకు పెరుగుతున్న గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం 7 గంటలకు ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 11.77 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10 లక్షల క్యూసెక్కులు పైబడి వరదనీరు దిగువకు ప్రవహించింది. సరాసరి గంటకు 15 వేల క్యూసెక్కులు చొప్పున ప్రవాహం పెరగ్గా నీటి మట్టం 2 పాయింట్లు చొప్పున పెరుగుతోంది. రాత్రి 12 గంటలకు నీటి మట్టం 13.60 అడుగులుగా నమోదు కాగా 12,68,958 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. అర్ధరాత్రికి నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి(13.75 అడుగులు)కి చేరవచ్చని అధికారుల అంచనా. కాగా ఎగువన భద్రాచలం వద్ద నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి రాత్రి 12గంటల సమయంలో 50.20 అడుగులకు చేరుకుంది. సాయంత్రం 5 గంటల నుంచి పెరుగుదల కొంత నెమ్మదించినా తాలిపేరు నుంచి వచ్చిన వరదనీటితో మరలా నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. దిగువన శబరి పరివాహకం నుంచి వస్తున్న వరదనీరు నెమ్మదించడంతో కుంట వద్ద నీటి మట్టం తగ్గుముఖం పట్టింది.

●ఎగువ నీటి మట్టాలు ఇవే

ఎగువున కాళేశ్వరం వద్ద నీటి మట్టం 12.390 మీటర్లు వరకు పెరిగి నిలకడగా కొనసాగుతుండగా పేరూరు వద్ద 17.260 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.470 మీటర్లు, భద్రాచలం వద్ద 49.40 అడుగులు, కూనవరం వద్ద 20.190 మీటర్లు నీటి మట్టం పెరుగుతుండగా కుంట వద్ద 13.30 మీటర్లకు పెరిగిన నీటి మట్టం తగ్గుముఖం పట్టి 12.500 మీటర్లకు చేరుకుంది. పోలవరం వద్ద నీటి మట్టం 12.900 మీటర్లకు చేరి పెరుగుతుండగా రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 16.390 మీటర్లుగా నమోదయింది.

నీట మునిగిన ఇసుక నావ

ధవళేశ్వరం, జూలై 22: వరద ఉధృతికి గాయత్రి ఇసుక ర్యాంప్ నుంచి కొట్టుకు వచ్చిన నావ కాటన్ బ్యారేజ్ 1వ గేటు వద్ద మునిగిపోగా నావను గేటు వద్ద నుంచి బయటకు తీయడానికి ఆదివారం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. చీకటి పడడంతో పనులు నిలిపివేశారు. సోమవారం గోదావరి వరద ఉధృతి పెరగడంతో నావ పూర్తిగా నీట మునిగింది. గోదావరి నీటి మట్టం తగ్గిన తర్వాత నావను బయటకు తీసే పనులు చేపట్టనున్నారు.



ఆత్రేయపురం:వాడపల్లి పుష్కర ఘాట్‌ను ముంచెత్తిన వరదనీరు



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సూచనలిస్తున్న కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

● ముమ్మడివరం

పాపం తాళ్లూరు వాసులు..



కొండలపైకి వెళ్లిపోతున్న తాళ్లూరు వాసులు

రంపచోడవరం, జూలై22: గోదావరికి వరద నీరు పోటెత్తడంతో దేవీపట్నం మండలం తాళ్లూరు గిరిజనులు కొండలపై తలదాచుకుంటున్నారు. అనేక కుటుంబాలు వరదలకు ముందే తమ బంధువుల ఇళ్లకో, ఇతర ప్రాంతాలకో తరలిపోగా సుమారు 10 కుటుంబాల గిరిజనులు గ్రామంలోనే ఉండిపోయి వరద పెరగడంతో గతంలో కొండలపై ఏర్పాటు చేసుకున్న తాటాకుపాకలకు తరలివెళ్లారు. ఈ గ్రామం కొండమొదలు పంచాయతీ పరిధిలోని 11 గ్రామాల్లో ఒకటి కాగా, గతంలో ఈ పంచాయతీలోని 10 గ్రామాలకు మాత్రమే చట్ట ప్రకారం పునరావాస చర్యలను అమలు చేసేందుకు అధికారులు ఒప్పందం కుదుర్చుకోగా, ఈ ఒక్క గ్రామాన్ని అధికారులు నిర్లక్ష్యం చేశారు. కనీసం ఈ గ్రామంలోని నిర్వాసితులు కోరుకున్న చోట పునరావాస కాలనీని నిర్మించకపోగా, పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా ఈ గ్రామాన్ని వరదలకు వదిలేస్తూ వచ్చారు. అధికారులు కోరుకున్నట్టుగానే వారి నిర్లక్ష్యాన్ని తట్టుకోలేని గిరిజనులు పునరావాసం అందకపోయినా క్రమేణా గ్రామాన్ని వదిలి వచ్చేస్తున్నారు. ఈ విధంగా వచ్చేయగా ఇంకా 10 కుటుంబాల నిర్వాసిత గిరిజనులు గ్రామంలోనే ఉండిపోయి వరద బాధితులుగా మారారు. గ్రామాన్ని వరద చుట్టేయడంతో తమ నాటుపడవల సాయంతో కొండలపైకి చేరుకున్నారు.

జల దిగ్బంధంలో 46 గ్రామాలు



కోతులుగుట్ట పునరావాస కేంద్రంలో బాధితులు

కూనవరం, జూలై 22: ఒక వైపు వాన... మరో వైపు వరద.. ఎదురుగా ఉగ్రరూపం దాల్చిన శబరి గోదావరి ప్రవాహం.. వీటితో కూనవరం మండల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా వరద పెరుగుతూ వస్తుండడంతో పునరావాసం వైపు పరుగులు తీశారు. దీంతో కూనవరం ఖాళీ అయింది. గ్రామాన్ని విడిచి వరద బాధితులు కోతులగుట్ట, ఫారెస్టు ఆఫీసుతో పాటు పక్క గ్రామాలకు పునరావాసాలకు తరలివెళ్లి పోయారు. ఒక్క ఏపీఆర్ పాఠశాలలోనే సుమారు 400 దళిత కుటుంబాలు తలదాచుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాన కురుస్తుండడంతో చంటి బిడ్డలను పట్టుకుని పునరావాసానికి వెళ్లిపోయారు.శబరికొత్తగూడెం, కూనవరంలోని ఉదయ భాస్కర్‌కాలనీ, గిన్నెల బజారు గ్రామాలు నీట మునిగాయి. మండలంలో సుమారు 46 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భద్రాచలానికి పూర్తిగా రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలోని ఒక గ్రామం నుంచి ప్రజలు మరో గ్రామానికి వెళ్లాలంటే రోడ్లపై వరదనీరు చేరడంతో పక్కనే ఉన్న అడవుల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. దీంతో నిత్యావసర సరుకుల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోజంతా ముసురుండడంతో బయటకు వెళ్లలేని పరిస్థితి. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మండలంలో పర్యటించి పరిస్థితులు సమీక్షించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ ముంపు మండలానికి ఒక ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. కూనవరం మండలానికి సంబంధించి చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య కృష్ణ పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. గ్రామాల చుట్టూ నీరు చేరడంతో తెలంగాణ నుంచి నిత్యావసర సరుకులు, కూరగాయలు దిగుమతి చేసుకోలేకపోతున్నామని దీనికి గాను భద్రాచలం వెళ్లేందుకు బోదునూరు అడవి గుండా ఏడుగురాళ్లపల్లి మీదుగా ఉన్న రహదారికి తక్షణమే మరమ్మతులు చేయించాలని టీడీపీ నాయకులు ఎడవిల్లి భాస్కరరావు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి వెంటనే స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ ఆ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రిజర్వు ఫారెస్టులో ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు పర్యవేక్షించాలని స్థానిక అటవీశాఖాధికారి మోహిణివిజయలక్ష్మికి సూచించారు. మరోవైపు పునరావాస కేంద్రంతో పాటు జలమార్గంలో ఉన్న గ్రామాల్లో సైతం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ తెలిపారు. తక్షణమే వారికి కిరోసిన్, కంది పప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలతో పాటు టార్పాలిన్లు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్-2024

తుది దశ కౌన్సెలింగ్

జేఎన్టీయూకే, జూలై 22: ఏపీఈఏపీసెట్-2024 అడ్మిషన్లకు సంబంధించి ఎంపీసీ విభాగం అభ్యర్థులకు తుది దశ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లో తొలి దశ వెబ్ కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ సోమవారం జారీ చేశారు. ఈనెల 25వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు చేసుకోవచ్చని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురం ఆంధ్రాపాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం సమన్వయకర్త, ప్రిన్సిపాల్ జనార్ధన్‌రావు తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలి. 7995681678, 7995865456, 9177927677 హెల్ప్ డెస్క్ నెంబర్లకు కూడా ఫోన్ చేయవచ్చు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోవాలి

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి. అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తుంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు. ర్యాంకు కార్డు, రేషన్ కార్డు, హాల్ టికెట్లను అప్‌లోడ్ చేయాలి. ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి 2022 నుంచి 10శాతం రిజర్వేషన్‌ను ప్రతిఏటా అమలు చేస్తున్నారు.

షెడ్యూల్ ఇదే

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు,
- రిజిస్ట్రేషన్: ఈనెల 23 నుంచి 25 వరకూ.
- అప్‌లోడెడ్ ధ్రువపత్రాల పరిశీలన: ఈనెల 26 వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు: ఈనెల 24 నుంచి 26 వరకూ..
- ఆప్షన్ల మార్పు: ఈనెల 27
- సీట్ల కేటాయింపు: ఈనెల 30
- సెల్ఫ్ రిపోర్టింగ్, కళాశాలల్లో రిపోర్టింగ్: ఈనెల 31 నుంచి ఆగస్టు 3 వరకూ..

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి. మొదటి దశ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు మాత్రమే షెడ్యూల్‌లో పేర్కొన్నవన్నీ చేయాలి. ఆ విధంగా కాకుండా తొలిదశలో సీటు పొంది తుది దశకు కూడా ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు కేవలం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుంటే సరిపోతుంది. తొలి దశలో పొందిన సీటు తుదిదశలో సంబంధిత విద్యార్థికి సీటు కేటాయింపు జరిగిన వెంటనే రద్దవుతుంది.

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.28.80 లక్షలు

మామిడికుదురు, జూలై 22: అప్పనపల్లి బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.28,80,990 వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.మాధవి తెలిపారు. 54 రోజులుకు గాను హుండీ లెక్కింపును సోమవారం నిర్వహించగా 1.500 మిల్లీగ్రాముల బంగారం 93 గ్రాముల వెండి వచ్చిందని ఏసీ తెలిపారు. లెక్కింపు కార్యక్రమానికి జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ దూనబోయిన నాగమల్లేశ్వరరావు ప్రత్యేకాధికారిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

మండపేట, జూలై 22: పట్టణంలో ఈనెల 23నుంచి 27 వరకు నాలుగు రోజులపాటు ఆధార్‌క్యాంపులను నిర్వహిస్తున్నట్లు మండపేట మున్సిపల్ కమిషనర్ బి.రాము తెలిపారు. పట్టణంలోని ఈనెల 23న మండపేట ప్రభుత్వ జూనియర్‌కళాశాల, 24న జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, ఎస్. ఎస్. వి.వి. మున్సిపల్ స్కూల్, అంగన్‌వాడీ స్కూల్, 25న జనార్దన మున్సిపల్ ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, 26న ధర్మగుండం 8వ సచివాలయం, వల్లూరివారి స్ట్రీట్ 9వ సచివాలయం, 27న బూరుగుంట చెరువు 4వ సచివాలయం, గొల్లగుంట రామాలయంవద్ద ఆధార్‌క్యాంపులు నిర్వహిస్తారు.


అల్లవరం: బోడసకుర్రు వంతెన వద్ద వైనతేయనది వరద


కె.గంగవరంలో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు


కె.గంగవరం: కోటిపల్లిలో దుకాణ సముదాయం వరకూ వచ్చిన వరదనీరు


మండపేట-ఆలమూరు రోడ్డులో ముంపులోనే వున్న వరి చేలు

గోదావరి పరవళ్లు

- లంక గ్రామాలకు పొంచి ఉన్న ప్రమాదం
- గోదావరిలో కలసిపోతున్న కొబ్బరి చెట్లు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పర్యటన
- భయాందోళనలో లంక గ్రామాల ప్రజలు

గోదావరి వరద ఉధృతితో కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ, వృద్ధగౌతమీ నదీపాయల వెంబడి ఉన్న లంక గ్రామాలు జలదిగ్బంధానికి గురవుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వరదనీరు వదలడంతో కోనసీమలో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో పలు మండలాలు వరద తాకిడిలో ఉన్నాయి. లంక గ్రామాల్లోని ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వర్షాలు, వరదలతో వేల ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ముంపు ప్రాంతాలను అధికారులు పర్యటించి సహాయకచర్యలు చేపడుతున్నారు.




మామిడికుదురు: అప్పనపల్లి గోదావరి తీరంలో నదిలో కలసి పోతున్న కొబ్బరిచెట్లు, కోటిపల్లి వద్ద ఏటిగట్టును పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న ఆర్డీవో సుధాసాగర్, బోడసకుర్రు రేవును పరిశీలిస్తున్న అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

మామిడికుదురు, జూలై 22: గోదావరికి క్రమేణా వరద తీవ్రత పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద తీవ్రత ఎక్కువగా ఉండడంతో మండలంలోని అప్పనపల్లి, పెదపట్నంలంక తీర ప్రాంతంలో గల కొబ్బరి తోటలు గోదావరిలో కలిసిపోతున్నాయి. కళ్ల ముందే తాము పెంచి పోషిస్తున్న కొబ్బరిచెట్లు గోదావరిలో కలిసి పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద నీటిమట్టం పెరుగుతుండడంతో పెదపట్నలంక, అప్పనపల్లి మధ్యగల పాటురేవు వరదనీట మునిగింది. ఈ దారిలో ప్రయాణించే ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అప్పనపల్లి కాజ్‌వేను అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి సోమవారం పరిశీలించారు. కాజ్‌వే మునిగిపోయే పరిస్థితి వస్తే లంక గ్రామాల ప్రజలకు అవసరమైన నాటు పడవలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాశర్లపూడిలో వరద ఉధృతిని పరిశీలించారు.

కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతి

కె.గంగవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో కోటిపల్లి వద్ద గోదావరినది ఉధృతగా ప్రవహిస్తోంది. కోటిపల్లి పుష్కరాల రేవులోని మెట్లన్నీ వరదనీటిలో చిక్కుకున్నాయి. ఫెర్రీ రేవులోని దుకాణ సముదాయం వరకూ వరద నీరు చేరింది. సుందరపల్లి, కూళ్లవద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టును తాత్కాలిక రక్షణ చర్యల్లో భాగంగా ఇసుక బస్తాలతో పటిష్ట పరిచారు. ఈ పనులను రామచంద్రపురం ఆర్డీవో సుదాసాగర్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీఈ కె.సుబ్బారావు, ఏఈ రెహమాన్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రనాథ్, వీఆర్‌వో సాయి పాల్గొన్నారు.

● మండలంలోని వరి పొలాలు ముంపు బారిన పడ్డాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయి. కానీ పొలాలు ముంపులోనే ఉన్నాయి. మండలంలోని మురుగుడ్రైన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. యండగండిలోని గుర్రపుడ్రైన్, యండగండి నుంచి పేకేరు వరకూ ఉన్న టేకి డ్రైన్ పొంగి ప్రవహిస్తుంది. ఇప్పటికే నాట్లు వేసిన పొలాల్లో నాట్లు కుళ్ళిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాజ్‌వే పైకి వరదనీరు

అయినవిల్లి: గోదావరి వరదనీరు క్రమంగా పెరుగుతుండడంతో లోతట్టు లంకగ్రామాలను వరదనీరు చుట్టుముడుతుంది. మండలంలో అయినవిల్లిలంక కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తుంది. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారి లంక గ్రామాల ప్రజలు కాజ్‌వేపైకి నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో పి.సూర్యనారాయణ మూర్తి కాజ్‌వేవద్ద పరిస్థితిని పరిశీలించారు.

బీవి.లంకలో వరద పరిస్థితి పరిశీలన

ఆలమూరు: ఆలమూరు మండలంలోని లంక గ్రామాలైన బడుగువానిలంక గ్రామంతోపాటు చెముడులంక, మడికి, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూములలో వేలాది ఎకరాలలో వాణిజ్యపంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. లంకలో ఉన్న పశువుల మకాంలలో ఉన్న పశువులను తరలించాలా లేదా అనే విషయంపై రైతులు తర్జనభర్జన పడుతున్నారు. జొన్నాడ వద్ద వరద ఉధృతి క్రమంగా పెరుగుతుంది. బ్రిడ్జిల వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. పుష్కరాల రేవు పూర్తిగా నీట మునిగింది. బడుగువానిలంకకు వరద పొంచి ఉండటంతో మండలస్థాయి అధికారులు సోమవారం పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ కె.నాగేశ్వరరావు, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో మేరీరోజ్, ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్‌లు గోదావరిఉధృతిపై చర్చించారు.

భయాందోళనలో లంక గ్రామాలు

ఆత్రేయపురం: గోదావరి వరద ఉధృతి రోజురోజుకు పెరగడంతో లంక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పిచ్చుకలంక, బొబ్బర్లంక, వాడపల్లి లంకల్లో వరదనీరు చేరడంతో ఆ ప్రాంతవాసులను అప్రమత్తంచేసి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే లంకల్లో సాగుచేసిన పంటలు వరదకు మునిగిపోయాయి. వాడపల్లి పుష్కరఘాట్‌లను వరద ముంచెత్తింది.

● వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల బృందం పర్యటించారు. ఆత్రేయపురం మండలంలో బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక, వాడపల్లిలంకల్లో సోమవారం సాయంత్రం తహసీల్దారు వెంకట్రామయ్య, ఎస్ఐ శ్రీనివాసులు సందర్శించి ఆ ప్రాంతంలో నివసించే కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని హెచ్చరించారు.

వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

కపిలేశ్వరపురం: గంటగంటకు పెరుగుతున్న వరద ఉధృత నేపథ్యంలో వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ అన్నారు. సోమవారం వరద ప్రభావిత ప్రాంతాలైన మండలంలోని కేదార్లంక, వీధి వారిలంక, నారాయణలంక గ్రామాల్లో ఆయన పర్యటించి వరద ఉధృతిని, పరిస్థితులను పరిశీలించారు. వరదల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులకు సూచించారు. ఆర్డీవో వెంట ఎంపీడీవో కొండల రావు, డీటీ వెంకటేశ్వరరావు, సీడీపీవో గజలక్ష్మి, సర్పంచ్‌లు సాకా శ్రీనివాస్, వీధివెంకటరెడ్డి, తదితరులు, వివిధ శాఖల అధికారులు, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీవో పర్యటన

అల్లవరం: వైనతేయ గోదావరికి వరద పోటెత్తనున్న నేపథ్యంలో తీరగ్రామాల ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి అన్నా రు. బోడసకుర్రు పల్లిపాలెంవద్ద వైనతేయ వరద ప్రభావిత ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ జేడీ కె.వెంకట్రావు మాట్లాడుతూ మత్స్యకారులు వరద నీటిలో వేటకు వెళ్లవద్దని సూచించారు. పునరావస కేంద్రం, వైద్య శిబిర ఏర్పాట్లు అంశాలపైఆర్డీవో అధికారులతో చర్చించారు. మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ ఏడీ కర్నిడీ మూర్తి, డీపీవో డి.రాంబాబు, తహసీల్దారు పి.సునీల్‌కుమార్, ఎంపీ డీవో బీఎస్ఎస్. కృష్ణమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఏఈ జి.స్వామి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, డాక్టర్ స్పందన, ఈవోపీఆర్డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గాశ్రీనివాస్, ఓలేటి పరమేశ్వరరావు, రొక్కాల నాగేశ్వరరావు, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు. వరద పరిస్థితులపై అల్లవరం మండల పరిషత్‌లో ఎంపీడీవో కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలతో సమావేశం నిర్వహించి సూచలను చేశారు.

లంక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం వరద ముంపు ప్రాంతాలైన టేకిశెట్టిపాలెం, అప్పనరాములంక, సఖినేటిపల్లిలాకుపేట, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వరద ఉధృతి పెరుగుతునందున లంకవాసులు పునరావాస కేంద్రాలకు రావాలని కోరారు. ఇప్పటికే ప్రజలకు వైద్య, పోలీస్, రెవిన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు పర్యటించి పలు సూచలను జారీ చేశారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1.16లక్షల విరాళం

ఆత్రేయపురం, జూలై 22: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి అన్నదాన భవన నిర్మాణానికి కాకినాడకు చెందిన దాసరి పట్టాభిరామస్వామి-హిమబిందు దంపతులు రూ.1.16లక్షల విరాళం సమర్పించారు. కంచుమర్తి రాజా రూ.10,116 విరాళం అందించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,24,355 లభించినట్టు ఉపకమీషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణం

ఆత్రేయపురం శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ర్యాలి జగన్మోహిని కేశవస్వామి పుణ్యక్షేత్రంలో శ్రావణ నక్షత్ర మాస కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ఈవో కృష్ణచైతన్య ఏర్పాట్లను నిర్వహించారు.

రేపు డాక్ చౌపల్స్ కార్యక్రమం

అమలాపురం టౌన్, జూలై 22: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలాపురం పోస్టల్ డివిజన్ పరిధిలో ఈనెల 24న డాక్ చౌపల్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం తెలిపారు. పోస్టల్ డివిజన్ పరిధిలోని రాజోలు ప్రధాన పోస్టాఫీసు, విలస సబ్‌పోస్టాఫీసు కార్యాలయాల వద్ద కార్యక్రమం జరుగుతుంది. పోస్టాఫీసులలో ప్రజలకు అందించే అన్నిసర్వీసులు, పథకాల గురించి డాక్ చౌపల్స్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. యువత అధికంగా పాల్గొనే విధంగా మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమానికి రూపకల్పన చేసినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. దీనిలో భాగంగా ఆయా పోస్టాఫీసుల వద్ద అదేరోజున ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

'టీచ్ టూల్‌తో మెరుగైన ఫలితాలు సాధించాలి'

అమలాపురం టౌన్, జూలై 22: టీచ్ టూల్ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కమలకుమారి సూచించారు. టీచ్ టూల్‌కు అనుగుణంగా పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించి వారిని ఖచ్చితంగా పరిశీలిస్తూ ఉండాలన్నారు. అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ నాల్గో రోజు శిక్షణా కార్యక్రమంలో సోమవారం డీఈవో పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్లు లక్ష్మీనారాయణ, దుర్గాదేవి, ఆర్పీలు వివేక్, హిమబిందు, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

తిక్కా కుటుంబ సభ్యులకు ప్రముఖుల పరామర్శ

అల్లవరం, జూలై 22: డి.రావులపాలెంలో తిక్కా కృష్ణవేణి మృతితో మాతృవియోగంతో బాధపడుతున్న తిక్కా వెంకటరెడ్డినాయుడు(బాబి)ని పలువురు ప్రముఖులు పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు, ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, వంటెద్దు వెంకన్ననాయుడు, జిన్నూరి రామారావు, తిక్కా వెంకటప్రసాద్ తదితరులు పరామర్శించి కృష్ణవేణి మృతికి సంతాపం తెలిపారు.

అభినందనలు



అమలాపురం టౌన్, జూలై 22: శాసనమండలి సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన పిడుగు హరిప్రసాద్‌ను సోమవారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో అమలాపురానికి చెందిన జనసేన నాయకులు నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, ఆర్డీఎస్ ప్రసాద్ తదితరులు కలుసుకుని అభినందించి సత్కరించారు.

ముంపు చేలను పరిశీలించిన అధికారుల బృందం


ఎ.వేమవరప్పాడులో ముంపు పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి బోసుబాబు, శాస్త్రవేత్తలు

అమలాపురం రూరల్, జూలై 22: మండల పరిధిలోని ఏ.వేమవరప్పాడు, నల్లమిల్లి గ్రామాల్లో ముంపు బారినపడ్డ పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం సోమవారం పరిశీలించారు. పంట పొలాల రైతులకు పలు సూచనలు చేశారు. డాట్ సెంటర్ సైంటిస్టులు ఎం.నందకిశోర్, డీఆర్సీ ఏడీఏ ఎస్.రాజశేఖర్‌ల బృందం ఆయా గ్రామాల్లో ముంపు నీటిలో ఉన్న పంటలనుచూసి రైతులతో మాట్లాడారు. ముంపునీరు దిగిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను బూస్టర్ డోస్‌గా వేసుకోవాలన్నారు. వారి వెంట సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ, మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్, ఏఈవోలు పాల్గొన్నారు.

ముంపులోనే వరిచేలు

మండపేట, జూలై 22: తుపాన్‌ప్రభావం కారణంగా గతకొంతకాలంగా కురుస్తున్న వర్షాలకు ఆలమూరు సబ్‌డివిజన్ పరిధిలో వరిపొలాలు ముంపులోనే ఉన్నాయి. డివిజన్ పరిధిలోవున్న 53వేల ఎకరాలు వరిసాగు జరుగు తుంది. ఇప్పటివరకు 80శాతం మేర 40వేలు ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. మొత్తం6250 ఎకరాల్లో వరిచేలు ముంపునకు గురయ్యాయని ఆలమూరు వ్యవసాయశాఖ ఏడీ కె.నాగేశ్వరరావు తెలిపారు.

వరి రైతులు యాజమన్య పద్ధతులు పాటించాలి

పి.గన్నవరం, జూలై 22: ఇటివలే కురిసిన భారీవర్షాలకు నారు మళ్లు, వరిచేలు ముంపునకు గురయ్యాయని ముంపు నుంచి పంటలను రక్షించుకోవడానికి ప్రతిరైతు యాజమన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన శాస్త్రవేత్త, కో-ఆర్డినేటర్ ఎం.నం దకిషోర్ సూచించారు. అనంతరం రైతులకు అవగహన కల్పించారు. వారి వెంట జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్, వ్యవసాయశాఖ అధికారులు కళ్యాణ్, జె.మనోహర్, సిబ్బంది ఉన్నారు.

'అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి'

మామిడికుదురు, జూలై 22: గోదావరికి వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వరద ప్రభావిత గ్రామాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర సూచించారు. అప్పనపల్లి గ్రామంలో ఆయన పర్యటించి స్నానాల రేవు, ఉచ్చులవారిపేటలను సందర్శించి అధికారులతో చర్చించారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పాముకాటు, కుక్క కాటు ఇంజక్షన్లతో పాటు ఇతర మందులను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు నీటి నాణ్యతా పరీక్షలు క్లోరినేషన్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్.సూర్యనారాయణరాజు, సీహెచ్‌వో సత్యవతి, పీహెచ్ఎన్ నారాయణమ్మ, హెల్త్ అసిస్టెంట్ జి.యజ్ఞేశ్వరరావు పాల్గొన్నారు.

జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి : ఎంపీపీ సత్యవేణి

కపిలేశ్వరపురం, జూలై 22 : గ్రామాల్లో జ్వరాలబారిన పడకుండా ప్రతీ ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అన్నారు. సోమవారం మండలంలోని టేకి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వాకతిప్ప పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారులు డా. చంద్రమౌళి, డా. రాకేష్‌చౌదరిలు మాట్లాడుతూ గ్రామంలో జ్వరాల నేపథ్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో 235 మందికి వైద్యసలహాలు, సూచనలతోపాటు అవసరమైన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించామన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కుక్కల నాగమణి, గ్రామకార్యదర్శి సత్తిబాబు, ఎంపీహెచ్‌ఈవో బిషప్, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి

రాయవరం, జూలై 22: గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంవల్ల సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ ఏవో డి.శ్రీనివాస్‌కు వినతిప్రతం అందజేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, శాకా దుర్గా శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు, ఈరెళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వీరేంద్ర కుటుంబ సభ్యులకు జనసేన నేతల భరోసా

అంబాజీపేట, జూలై 22: సౌదీ ఎడారిలో చిక్కుకుని ఇబ్బంది పడుతున్న సరెళ్ళ వీరేంద్రకుమార్ రెండు రోజుల్లో ఇంటికి వచ్చే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకుంటున్నారని జనసేన నేతలు కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఇసుకపూడిలో వీరేంద్ర తల్లిదండ్రులు సత్తిరాజు, మరియమ్మ, అతని సోదరుడు రవీంద్రలను కలిసి ధైర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గిడ్డి ఆనంద్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల సూరిబాబు, నేదునూరి పెద్దిరాజు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, యనమదల సాయిబాబు, సర్పంచ్ మోహన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ప్రమాద బీమా చెక్కులు పంపిణీ

రావులపాలెం, జూలై 22: రావులపాలెం మండలంలో ప్రమాదవశాత్తు గాయపడిన ముగ్గురు జనసేన కార్యకర్తలకు జనసేన ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. పొడగట్లపల్లికి చెందిన ఇద్దరు కార్యకర్తలకు వైద్య ఖర్చుల నిమిత్తం పెంటపాటి ఏసుకు రూ.14,083, కలిగినీడి ప్రసాద్‌కు రూ.29,200 అలాగే ఊబలంకకు చెందిన దామోదర దుర్గాప్రసాద్‌కు రూ.50వేల చెక్కులను కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దొంగా వెంకటసుబ్బారావు, మండల అధ్యక్షుడు తోట స్వామి, భూపతిరాజు రామరాజు, అల్లూరి కృష్ణంరాజు, శకునాల గణపతితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ద్వారపూడి ప్రభుత్వ ఆసుపత్రికి ఫ్రిజర్ ఫర్నీచర్ అందజేత

మండపేట, జూలై 22: మండపేట మండలం ద్వారపూడిలోవున్న ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలను భద్రపరిచే ఫ్రిజర్‌తోపాటు, రోగులు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు, 50 ఇన్వర్టర్‌లను మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ 117వ శాఖను ద్వారపూడిలో సోమవారం ప్రారంభించామన్నారు. ఈకార్యక్ర మంలో రాధాపుష్పవతి, ద్వారపూడి గ్రామశాఖ అధ్యక్షుడు పళ్లసన్యాసిరావు, వైద్యాధికారి జగదీష్ పాల్గొన్నారు.

రైతుకూలీ సంఘం కార్యదర్శిగా ఉండ్రు గనిరాజు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 22 :రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెం గ్రామానికి చెందిన ఉండ్రు గనిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 20న రాజమహేంద్రవరంలో జరిగిన ఏఐకెఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో ఉండ్రు గనిరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి బి.సిద్ధూలు తెలిపారు.

'స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి'

రాయవరం, జూలై 22: భారత పార్లమెంట్ చేసిన చట్టాలపై కొంత మంది ఐఏఎస్ అధికారులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంటూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ దివ్యాంగులపై గౌరవం ఉందని అంటూనే వారి రిజర్వేషన్లపై చులకనగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



అమలాపురం టౌన్, జూలై 22: అమలాపురం విక్టరీ అకాడమీలో సోమవారం కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-11 జిల్లాస్థాయి చెస్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. 11 ఏళ్లలోపు బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలను ఈ నెల 27న భీమవరంలో జరిగే అండర్-11 రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేసినట్టు జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. బాలుర విభాగంలో పీడీఎస్ కార్తీక్ ప్రథమ, చింతపల్లి జగదీష్ ద్వితీయ, కనకాల విద్వేష్ తృతీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో గెద్దాడ అక్షయ ప్రథమ, బి.బ్లెస్సీ ద్వితీయ, నూకపెయ్యి హన్విక తృతీయ స్థానాలు సాధించి జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ప్రాతినిథ్యం వహించనున్నట్టు సురేష్ తెలిపారు.

తైక్వాండో విద్యార్థుల ప్రతిభ

అంబాజీపేట, జూలై 22: కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 21వ తేదీన ఇంటర్ తైక్వాండో ఛాంపియన్ షిప్ జిల్లా స్థాయి పోటీలలో అంబాజీపేట తైక్వాండో విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు మెడల్స్‌ను సాధించినట్లు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులను అభినందించారు. సబ్ జూనియర్స్ విభాగంలో కె.శాలిని, బి.లాహౌతేజ, జీజీ లేఖన, ఎం.మౌనిక, ఎ.పవన్‌తేజలు బంగారు పతాకాలు, ఎం.వినూత్న, ఆర్.సర్వం, షణ్ముఖసాయి, ఐ.డానిల్, వై.ఈషా, డి.గిరిజ, సీహెచ్ వర్షిత, దీపక్‌లు సిల్వర్ మెడల్స్, ఎం.హర్షదీపిక, కె.ఆధ్య, జె.షైని, జె.శామ్యూల్, ఆర్.జోష్న, ఎస్.కావ్య, ఈ. బంగారయ్య, అంజనేయులు బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. క్యాడిట్ విభాగంలో పి.శరణ్య, కె.సాయిదుర్గ, హేమరితలు బంగారు పతకం, నూకేష్, పూజితలకు బ్రౌంజ్ మెడల్స్‌సాధించారు. ఈవిద్యార్థులను హెచ్‌ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, తదితరులు అభినందించారు.

యానాంకు వరద తాకిడి

- ఫెర్రిరోడ్డుకు చేరిన వరద నీరు
- అధికారుల తీరుపై ఆర్ఏ ఆగ్రహం


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్ఏ మునిస్వామి

యానాం, జూలై 21: ఏగువున కురుస్తున్న వర్షలకు గౌతమి గోదావరికి వరద నీరు చేరడంతో కేంద్రపాలిత ప్రాంతమైనా యానాంకు వరద తాకిడి తాకింది. దీంతో యానాం ఫెర్రిరోడ్డపైకి వరద నీరు చేరింది. వరద పరిస్థితిపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో అధికారులతో సోమవారం ఉదయం తన కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ప్రజాపనులశాఖ అధికారుల తీరుపై ఆర్ఏ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎంసీ బాలయోగి కాలనీకి ఆనుకు ని ఉన్న వరద పరిరక్షణ గట్టుపై ఉన్న కాలువకు ప్రజాపనులశాఖ అధికారులు షెట్టర్ ఏర్పాటు చేశారు. ఆ షెట్టర్ గెట్లను సక్రమంగా వినియోగించకపోవడంతో గేట్ల ద్వారా వరద నీరు కాలువ ద్వారా ఫెర్రిరోడ్డుపైకి చేరడంతో అధికారుల అలసత్వంపై పరిపాలనాధికారి మునిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫెర్రీరోడ్డుపైకి వరదనీరు చేరడంతో అటుగా వెళ్లే ప్రజలు, విద్యార్థులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా కాలనీలోని పల్లపు ప్రాంతాలలోకి వరద నీరు చేరడంతో ఇంజన్ల ద్వారా బయటకు తోడించే ఏర్పాట్లును చేస్తున్నారు.

రాజోలు రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా కాసు శ్రీను


కాసు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

రాజోలు, జూలై 21: రాజోలు రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా రాజోలుకు చెందిన కాసు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజోలు రోటరీ క్లబ్‌లో 2024-25 సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యదర్శిగా కె. సోమరాజు, కోశాధికారిగా నామన షణ్ముకేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా, జాయింట్ సెక్రటరీగా మహ్మద్ మొహిద్దీన్‌తో పాటు మరో ఎనిమిది మంది నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కల్యాణ్‌చక్రవర్తి పాల్గొని సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కాసు మాట్లాడుతూ రాజోలు రోటరీని సేవా కార్యక్రమాల్లో మరింత ముందుకు అందరి సహకారంతో తీసుకువెళతానని తెలిపారు. రోటరీకి నూతన సభ్యులుగా ఎన్నికైన సోమిశెట్టి ఆంజనేయులు రోటరీ భోజనశాలకు ఐదు ఏసీలు బహూకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ బి.వెంకటతిరుమలరావు, డాక్టర్ బసవా వరహాలు, బోళ్ల శ్రీనివాస్, యేడిద కవీంద్ర, చిట్నీడి లక్ష్మణరావు, పట్నాల దత్తాత్రేయ, కసుకుర్తి రామకృష్ణపాల్గొన్నారు.

కొప్పేశ్వరస్వామిని దర్శించుకున్న మంత్రి సుభాష్


పలివెల కొప్పేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్

కొత్తపేట, జూలై 22: కొత్తపేటలో శ్రీ ఉమాకొప్పేశ్వరస్వామిని రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి సుభాష్, టీడీపీ నాయకుడు గంధం పల్లంరాజులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట టీడీపీ నాయకుడు కొప్పిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో తాత్కాలిక పూడికతీత పనులు

- రైతుల హర్షం

ఉప్పలగుప్తం, జూలై 22: వర్షాల కారణంగా సార్వా వరినారు మళ్ళు, సార్వా నాట్లు ముంపు బారిన పడ్డాయి. డ్రెయిన్లు మూసుకుపోవడంతో పొలాల్లోని ముంపునీరు బయటకుపోయే మార్గంలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ముంపు పరిస్థితిని పరిశీలించిన అధికారులు నివారణ చర్యలు ప్రారంభించారు. డ్రెయిన్స్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం గొరగనమూడి, గోపవరం ఉత్తర పీకాలేరు డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగించే చర్యలను ప్రారంభించారు. ఫలితంగా పొలాలకు ముంపు నుంచి రక్షణ లభిస్తుందని వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు అన్నారు. డ్రెయిన్లలో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.


గొరగనమూడి డ్రెయిన్‌లో తూడు తొలగిస్తున్న దృశ్యం

'ఆశీలు బకాయిలపై చర్యలు తీసుకున్నాం'

ద్రాక్షారామ, జూలై 22 :ద్రాక్షారామ ఆశీలు పాటలు బకాయిలపై చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ కొత్తపల్లి అరుణ తెలిపారు. సోమవారం గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2021-22 ఏడాదికి వెలంపాలెం గ్రామానికి చెందిన శిరిగినీడి సత్తిబాబు రూ.10.26 లక్షలు చెల్లించేందుకు పాడుకుని రూ.2.80లక్షలు చెల్లించామని, బకాయి సొమ్ము రూ.7.46 లక్షలు చెల్లించాలని కోర్టులో దావా వేశామని తెలిపారు. 2022-23 ఏడాదికి గుబ్బల శ్రీనివాసరావు రూ.14.69 లక్షలు చెల్లించేందుకు పాడుకుని రూ.7.47లక్షలు చెల్లించామని మిగిలిన మొత్తం రూ.6.94లక్షలు బకాయి సొమ్ము చెల్లించాలని కోర్టులో దావా వేసినట్లు వివరించారు.

శాంతిభద్రతలు కాపాడటంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ కృష్ణారావు


ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

ద్రాక్షారామ, జూలై 22: శాంతి భద్రతలు కాపాడటంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచించారు. సోమవారం ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సందర్శించారు. స్టేషన్ పరిధి, కేసుల నమోదు, ఎక్కువగా జరిగే నేరాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్ఐ సురేంద్రబాబు పాల్గొన్నారు.

మండపేట: మండపేట పట్టణ పోలీసుస్టేషన్‌ను సోమవారంరాత్రి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన సోమవారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో కేసుల వివరాలు క్రైమ్‌రేటుతోపాటు పలు అంశాలు గురించి ఎస్పీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట రామ చంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్ కుమార్, పట్టణ ఎస్.ఐ హరికోటిశాస్త్రీ ఉన్నారు.

'15 రోజుల్లో విచారణ పూర్తిచేస్తాం'


విచారణ చేస్తున్న సీపీవో రాంబాబు

మామిడికుదురు, జూలై 22: మొగలికుదురు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై 15 రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. పంచాయతీలోని 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయని పంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు సీపీవో సోమవారం విచారణ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉపసర్పంచ్ వార్డు సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సీపీవో పంచాయతీ రికార్డులను తనవెంట తీసుకువెళ్లి విచారణను 15 రోజుల్లో పూర్తిచేస్తానని తెలిపారు. అనంతరం ప్రధాన పంటకాల్వ పక్కన ఆక్రమణలను పరిశీలించి ఆక్రమణదారులకు తక్షణం నోటీసులు పంపించాలని ఆదేశాలిచ్చారు.